# చిత్తూరులో ఏనుగుల విధ్వంసకాండ

అడవుల నష్టాన్ని గురించి ఈమధ్య మనం చాలా వింటున్నాం. మనదేశంలోని అటవీభూభాగం అతివేగంగా తరుక్కుపోతోందని ప్రభుత్వమేవాపోతోంది. దేశంలో అటవీభూభాగం కనీసం 30 శాతం ఉండాలని నిపుణులు అంటారు. కాగా. మన దేశంలో అడవులు 10 శాతం కూడా మిగలలేదు.

అడవుల నాశనం వలన దుష్ఫలితాలు చాలా వున్నాయి. ఇందులో ప్రధానమయినవి వర్షపాతం తగ్గిపోవడం, భూసారం ధ్వంసం కావడం. అంతేకాక, అడవుల మీద ఆధారపడి బ్రతికే ప్రజానీకం (ముఖ్యంగా గిరిజన తెగలు) చాలా ఇబ్బందులకు గురి అవుతారు. పొయ్యిలోకి కట్టెపుల్లలకోసం, ఆహారంలో భాగమయిన పళ్ళుఫలాల కోసం, చేతివృత్తులకు ఉపయోగపడే అడ్డాకుల వంటి ఆకుల కోసం, వాళ్ళు అడవుల మీద ఆధారపడతారు.

అడవులలో పశువులను మేపుకుంటారు, అడవికట్టెతోనూ రెల్లుతోనూ ఇళ్ళు కట్టుకుంటారు, ఇంకా, బీడీఆకు మొదలైన వన్యసంపదను సేకరించి అమ్ముకుంటారు. అడవులు నాశనం అయ్యేకొద్దీ ఈ వనరులన్నీ క్రమంగా వాళ్లకు అందుబాటులో లేకుండా పోతాయి.

అయితే అడవుల నాశనాన్ని ఆపడానికి ప్రభుత్వం ఎంతమాత్రం సిద్ధంగా వున్నట్టు అనిపించదు. ఎందుకంటే వివిధ వర్గాల ధనవంతులకు ఈ అటవీసంపద అవసరం. అడవులలో వుండే ఖనిజసంపద (ఇనుము, బొగ్గు, సున్నపు రాయి వగైరా) పారిశ్రామిక పెట్టుబడిదారులకు అవసరం. అడవులలోని కలప కూడా కాగితపు పరిశ్రమకు అవసరం. ధనవంతులు గ్రామాలలోనూ పట్టణాలలోనూ కట్టుకునే భవంతులకూ ఈ కలప అవసరం, నిజానికి కలప మీదఆధారపడే ధనిక వర్గం చాలా పెద్దదే. పెట్టుబడిదార్లు, కలపకాంట్రాక్టర్లు, ట్రక్కుల యజమానులూ, కోత డిపో సేఠ్‌లూ, ఫర్నిచర్ కంపెనీల యజమానులూ, ఈ కలపనూ ఫర్నిచర్‌నూ ఉపయోగించుకొని ఆర్భాటంగా భవనాలు నిర్మించుకునే ధనవంతులూ, ఈ వనరుల వినియోగంలో భాగస్వాములే. వీరి కోసం ప్రభుత్వం అడవుల నాశనాన్ని కొనసాగనిస్తూనే ఉంటుంది. పోనీ, కొత్త అడవుల పెంపకాన్ని తగుమోతాదులో చేపడుతుందా అంటే అదీ లేదు. దానికి కావలసిన ప్రణాళికగానీ సంయమనంగానీ భారత ప్రభుత్వ విధానాలలో లేదు.

అడవుల నాశనంవల్ల పైన చెప్పినవేకాక మరొక నష్టం కూడా వుంది. అదేమిటంటే అడవులలో వుండే వన్యమృగాలు తమ నివాస స్థలాన్నీ, జీవనాన్నీ, కోల్పోయి, సమీపంలోని గ్రామాల మీద దాడిచేయడం. ఒక సంవత్సరం కాలం పైగా, అనంతపురం జిల్లాలోని మడకశిర తాలూకాలో శివంగులు గ్రామాల మీద పడి చిన్న పిల్లలను ఎత్తుకుపోతున్నాయని వార్తలు వస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని అచ్చంపేట ప్రాంతంలో పులులు గ్రామాల మీద దాడి చేసి పశువులను చంపడం గురించి కూడా చదువుతున్నాం.

క్రిందటి సంవత్సరం మెదక్‌జిల్లా నర్సాపూర్ అడవుల నుండి ఒక చిరుతపులి సికిందరాబాద్ వచ్చేసి మారేడ్‌పల్లిలో బీభత్సం సృష్టించింది. అడవులనాశనం, కొంతవరకూ దాని పర్యవసానమయిన కరువు, వన్యమృగాలను మానవ ఆవాసాల లోకి తరుముతున్నాయి. తిండి కోసం, నీళ్ళకోసం. సంరక్షణ కోసం, అవి దూర ప్రాంతాలకు వలసపోవలసి వస్తోంది.

ఇటువంటి సంఘటనలన్నింటిలోనికీ జనందృష్టిని ఎక్కువగా ఆకర్షించింది చిత్తూరుజిల్లాలో ఏనుగుల సమస్య. చిత్తూరు జిల్లాలోని దక్షిణ భాగంలో విశాలమయిన చిట్టడవి ఉంది. ఇది తూర్పుకనుమల మధ్యనున్న ఎత్తయిన భూభాగం కావడం వల్ల వర్షపాతం సమృద్ధిగా వుంటుంది. మడుగులు, ఏరులు, నీటివసతిని కల్పిస్తాయి. అయినప్పటికీ ఆ అడవి చిట్టడవే. వన్యమృగాలకు పెద్దగా నివాసయోగ్యమయినది కాదు. ఇతరత్రా కూడా అదేమంత ఉపయోగకరమయిన అడవి కాదు. మన రాష్ట్రంలోని అడవులలో విస్తారంగా దొరికే టేకుకలప అక్కడ దాదాపు మృగ్యం. ఒకప్పుడు ఎర్రచందనం సమృద్ధిగా దొరికేదిగానీ అదంతా స్మగ్లర్ల వాతపడి, సరయిన పురోభివృద్ధిపథకాలు లేక, ఇప్పుడు ఆ కర్రకూడా అంతంత మాత్రమే దొరుకుతుంది.

అయితే చిత్తూరునుండి పడమటి దిక్కుగానూ నైరుతి దిక్కుగానూ కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలోకి పోతే ఈ అడవి నీలగిరి కొండలూ, కావేరిలోయ, పడమటి కనుమల దాకా పరుచుకొని వుంది. అక్కడి అడవి చిట్టడవి కాదు. రకరకాల ఉపయోగకర మయిన కలప రకాలు దొరికేఅడవి అది. ఆ అడవి ఏనుగులకు కూడా నిలయం. కొన్ని శతాబ్దాలుగా దక్షిణభారత దేశంలోని దేవాలయాలకు ఈ అడవి, ఏనుగులను సరఫరా చేస్తోంది.

చాలాఏళ్ళుగా ఈ అడవిని కలప కోసం నాశనం చేస్తూ వచ్చారు. దట్టమయిన అడవులతో నిండివున్న కొండచరియలు ఇవ్వాళ బోసిగా కనిపిస్తాయి. దానికితోడు గత మూడు నాలుగేళ్ళుగా దేశమంతటా కరువు. అంటే మనుష్యులకూ జంతువులకూ తిండి సమస్య, నీటి సమస్య తీవ్రంగా వుంది. ఫలితంగా అక్కడి నుండి అడవి ఏనుగులు తిండీ, నీళ్ళూ, ఆశ్రయం వెతుక్కుంటూ ఉత్తరందిక్కుగానూ ఈశాన్యందిక్కుగానూ వలస బయలుదేరాయి. 1984 సంవత్సరంలోచిత్తూరు జిల్లాకు చేరుకొన్నాయి. ఒక ఏడు ఏనుగుల మంద సంవత్సరం మొట్టమొదటి సారి ఈ ప్రాంతంలో కనబడింది. ఆంధ్ర తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో వుండే ఎగుడుదిగుడు ప్రదేశంలో వున్న ఒక అర్ధచంద్రాకారపు లోయను ఎంచుకొని అందులో పైకీ కిందికీ విహరిస్తూ, కనిపించిన పొలాలను మేయడం మొదలు పెట్టాయి. ఈ లోయ ప్రాంతంలో ఆరు మండలాలకు చెందిన దాదాపు 100 గ్రామాలు, పల్లెలు, తండాలు వున్నాయి. ఆ మండలాలు పలమనేరు, కుప్పం, వెంకటగిరికోట, రామకుప్పం, బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యెం. ఇవి కాక శాంతిపురం, పుంగనూరు తదితర మండలాల మీదికి కూడ ఏనుగులు దాడి చేస్తున్నాయి. 1984 లో 7 ఏనుగుల మందగా ప్రారంభం అయినవి ఇప్పుడు 40 కి పైగా ఉన్నాయి. పుష్కలంగా వరి, రాగులు, చెరుకు, జొన్నలు, వేరుశనగ, కొబ్బరి పంటలు పండించే ఈ ప్రాంతపు రైతాంగం ఇప్పటికి అయిదేళ్ళయి తమ శ్రమనంతా ఈ ఏనుగులకు పెడుతున్నారు. వీళ్ళేమయినా దిక్కులేని గిరిజనులా అంటే కాదు. 100 ఎకరాలకు పైగా భూములున్న భూస్వాముల నుండి ఒకటి రెండెకరాల మెట్టభూములున్న చిన్న రైతుల దాకా అన్ని వర్గాల వాళ్ళూ ఉన్నారు. రెడ్డి, కమ్మ, గౌడ, బలిజ కులాల నుండి హరిజనుల దాకా అన్ని కులాల వాళ్ళూ ఉన్నారు.

వీళ్ళ శ్రమ వల్ల సస్యశ్యామలమ

యిన ఈ ప్రదేశం ఏనుగులకు స్వర్గతుల్యంగా అనిపించినట్టుంది. పగలు అడవిలో ఏ మడుగుదగ్గరో పడుకొని, రాత్రి పొలాల మీద పడి తినడం, తొక్కి నాశనం చేయడం, మళ్ళలో కేరింతలు కొడుతూ దొర్లడం, వాటి దినచర్య అయింది. ఈ అయిదేళ్ళలో పై ఆరు మండలాల రైతులు దాదాపు 2 కోట్ల రూపాయలు నష్టపోయి వుంటారు.

పంటనష్టంతో బాటు ప్రాణ నష్టమూ జరిగింది. ఇప్పటికి 24 మందిని ఏనుగులు తొక్కి, లేక తొండంతోచుట్టి, విసిరేసి చంపాయి. ఇవ్వాళ అక్కడి రైతులంతా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బ్రతుకుతున్నారు. పగలు పొలాల్లో వ్యవసాయం చూసుకుంటారు. సాయంత్రం అయితే ఇళ్లల్లోకి వచ్చి తలుపులు బిగించుకొని బితుకుబితుకుమంటూ రాత్రి వెళ్లదీస్తారు. లేదా, ఊరిజనమంతా పొలం గట్లదగ్గర చేరి దివిటీలు పట్టుకొని కేకలు వేస్తూ తప్పెట్లు కొడుతూ బాణాసంచా పేలుస్తూ ఏనుగులను తరిమి వేయడానికి ప్రయత్నిస్తారు. వాళ్ల అదృష్టం బాగుంటే ఏనుగులు ఈ గొడవకు పారిపోతాయి. లేకపోతే మరింత రెచ్చిపోయి జనంమీదికే వచ్చి, జనాన్ని గ్రామాలలోకి తరిమేసి తమ పని ముగించుకొని పోతాయి.

అక్కడి జనం దినచర్య, ఏనుగుల దినచర్యకు ప్రతిస్పందన. వాళ్లకు వేరే ప్రపంచం తెలీదు, వేరే ఆలోచన లేదు. ఏనుగుల రాకపోకలే వాళ్లకు వార్తలు. వాటి దాక్షిణ్యమే వాళ్ల అదృష్టం, వాటి చేష్టలే భగవంతుని లీలలు, వాటి దౌర్జన్యమే ప్రారబ్దం. పొద్దున్న లేచి ఏ వూళ్ళోనయినా నలుగురు గుమిగూడే చోట చెప్పుకొనే విశేషాలు బోఫోర్స్ కుంభకోణం గురించికాదు, కరుణానిధి విజయాన్ని గురించి కాదు, ఎన్టీఆర్ క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ విన్యాసాల గురించీ కాదు, 'రాత్రి ఆవులకుప్పం గోవిందసామి శెనిగతోట తిని పూడ్సి నాయంటనే' అనో, లేకపోతే అదృష్టం బాగుంటే రెండునెల్లగా 'యానిగలు మా తట్టు రాలేదప్పా' అనో చెప్పుకుంటారు.

ఇలా ఇప్పటికి అయిదేళ్ళుగా సాగుతూనే వున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు. మొదట్లో జనం పిటిషన్లు పెట్టుకోగా మండల రెవెన్యూ ఆఫీసు నుండి రెవెన్యూ ఇన్‌స్పెక్టరు వచ్చి, పంటనష్టాన్ని తన బుద్ధికి తోచినట్టు అంచనా వేసుకొని పోయేవాడు. ఆయనకు కనపడ్డ నష్టం 5 రూపాయలు కావచ్చు, 10 రూపాయలు కావచ్చు, 20 రూపాయలు కావచ్చు. ఆ ప్రకారం నష్టపోయిన రైతులకు ఎం.ఆర్.వో 'అక్కౌంట్ పేయి' చెక్కులు ఇచ్చేవాడు, రెండు రూపాయల చెక్కులూ అయిదు రూపాయల చెక్కులూ చేతిలో పెట్టుకొని బ్యాంకులను వెతుక్కుంటూ పోయిన రైతులు చాలా మంది వున్నారు. ఈ బూటకపు నష్టపరిహారాన్ని జనం విమర్శించగా ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకుంది. చెరుకుపంట ఒక ఎకరం నష్టం అయితే 500 రూపాయలు, వరిపంటకు 250 రూపాయలు, ఇవ్వడం మొదలుపెట్టింది. ఇవి మరీ తక్కువ అని గొడవచేయగా చెరుకుకు నష్టపరిహారం ఎకరానికి 1250 రూపాయలు, వరిపంటకు 500 రూపాయలు ఇవ్వడం మొదలుపెట్టింది ప్రభుత్వం. ఇది ఎంత సమంజసమయిన నష్టపరిహారమో తెలుసుకోవాలంటే, చెరుకు ఒక ఎకరానికి అయ్యేఖర్చు 1500 రూపాయలు ఉంటుందనీ, రాబడి ఎంతలేదన్నా 10,000 రూపాయలు ఉంటుందనీ గుర్తుంచుకోవాలి. అంటే ఇప్పుడు ఇస్తున్న నష్టపరిహారం ఖర్చులకు కూడా రాదన్నమాట, అంతేకాక, చెరుకు, వరి పంటలకు ఈ మాత్రమయినా ఇస్తున్నారు. కానీ జొన్నలు, వేరుశెనగ, మొదలయిన మెట్టపంటలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు. కొబ్బరి తోటలు, మామిడితోటల విధ్వంసనానికయితే అంచనావేసే ఆలోచనసహితం లేదు.

ఈ నిర్లక్ష్యాన్ని గురించి ప్రభుత్వాన్ని నిలదీస్తే విచిత్రమయిన సమాధానం ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌కు సమాధానం చెప్తూ, ఈ పరిస్థితి ఉత్పన్నం కావడానికి ప్రజలే కారణం అంటుంది ప్రభుత్వం. ఏనుగులు ప్రభుత్వంలో భాగం అయినట్టు వాటిని వెనకేసుకొస్తుంది. 1984 లో ఏనుగులు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు అడవికే పరిమితం అయివున్నాయనీ, జనం ఒక ఏనుగు పిల్లను ఎత్తుకుపోవడంతో రెచ్చిపోయి, ఊళ్ళమీదికి రావడం మొదలు పెట్టాయనీ అంటుంది. అంతేకాక, చట్టబద్ధంగా బ్రతికేవాళ్ళెవ్వరినీ ఏనుగులు చంపలేదనీ, దొంగతనంగా అడవిలో కట్టెలు కొట్టడానికో లేక పశువులను మేపుకోవడానికో పోయినవాళ్ళనే ఏనుగులు చంపాయనీ అంటుంది. నిజానికి, చనిపోయిన వాళ్ళలో అత్యధికులు తమ పొలంగట్ల మీదనో లేక కాలిబాటల మీదనో చనిపోయారు. అంతేకాక, రిజర్వ్ ఫారెస్ట్ అయినంత మాత్రాన ఆ అడవిలోకి పోవడమే ఒక నేరం కాదు. రిజర్వ్ ఫారెస్టులో పశువులను మేపుకోవడమూ నేరంకాదు. ఎండు పుల్లలు ఏరుకోవచ్చును. ఆవులనూ గేదెలనూ మేపుకోవచ్చును. పచ్చికట్టె మాత్రం కొట్టకూడదు. మేకలను మాత్రం మేపకూడదు. (మేకలు చిన్న మొక్కలను తింటాయి కాబట్టి వాటివల్ల అడవుల విధ్వంసనం జరుగుతుందని మేకలను మేపడాన్ని నిషేధించారు) అంతేకాకుండా, ఒక గ్రామంనుండి మరొక గ్రామానికి పోయేటప్పుడు అడవిబాటల మీదుగా పోవడం అనివార్యం అవుతుంది. అటువంటప్పుడు , మీరు అడవులలోకి పోకనే వుంటే, ఏనుగులు మీ జోలికి వచ్చేవికావు. అనేది అర్థరహితమయిన వాదన. ఇకపోతే, ఏనుగులు పొలాలమీదికి రాకుండాచేయడానికి ప్రభుత్వం ఏమయినా చేసిందా అంటే చేసాననే అంటుంది. ఏనుగులకోసం ఒక రక్షితవనం ఏర్పాటుచేసి అందులోకి ఈ 40 ఏనుగులను తరిమి ఉండవచ్చును. ఆ పనీ చేయలేదు. లేదా ఈ ఏనుగులను పట్టి సర్కస్‌లకో, జంతు ప్రదర్శనశాలలకో, దేవుళ్ళగుళ్ళకో, అమ్మి వుండవచ్చును. ఆ పనికూడా చేయలేదు. మరి ప్రభుత్వం ఏం చేసిందంటే అడవికి అడ్డంగా 'గజనిరోధక విద్యుత్ కంచె' ను నిర్మించింది. అచ్చ తెనుగులో చెప్పాలంటే, అడవికి అడ్డంగా ఇనుపతీగెల కంచెవేసి, దానికి కరెంటు పెట్టింది. అయితే ఈ ప్రయోగం పూర్తిగా నిరర్థకంగా తయారయింది. ప్రతీ గ్రామంచుట్టు కంచెవేస్తే ఒకరకంగా వుండేది. కానీ, అడవికి అడ్డంగా కంచె వేస్తే కంచెకు అటూ ఇటూ కూడా గ్రామాలుంటాయి. అంతేకాక ఈ అడవికి నిలువుగా చిత్తూరు జిల్లా నుండి తమిళనాడుకు వెళ్ళే రోడ్లు మూడు వున్నాయి. వీటిని కంచెతో మూసేయడానికి వీలు లేదు. పైగా ఈ కంచె వేసే పని, అన్ని ప్రభుత్వరంగ కార్యక్రమాలలాగా నెమ్మదిగా సాగుతుండగానే ఏనుగులు, వేసిన కంచెను వేసినట్టు ధ్వంసం చేస్తున్నాయి. కంచెను నిలబెట్టే స్తంభాలు ఇనపవికాక రాతివి కావడంతో, కరెంటుపెట్టినా కూడా ఏనుగులు ఆ రాతి స్తంభాలను కాలితో తన్ని ధ్వంసం చేయగలుగుతున్నాయి. చివరిగా కంచెలో ప్రవహించే కరెంటు నిరంతరం ప్రవహించదు.

ఈ నిష్ప్రయోజకత్వానికి ఫలితం ఏమిటంటే, ప్రపంచంలోని నాగరిక దేశాలలో ఒకటిగా లెక్కించబడే ఈ దేశంలో, 20 వ శతాబ్దపు చివరి దశాబ్దంలో, దాదాపు 100 వూళ్ళ రైతులు అడవి ఏనుగులకు భయపడి బ్రతుకుతున్నారు. అభివృద్ధి అంటే కలర్ టి.వి.లు, కంప్యూటర్లు, జపానీకార్లు, దేశంలోకి దిగుమతిచేయడం కాదు, ప్రజలకు కనీస స్థాయిలో గౌరవప్రదమయిన జీవనంకల్పించడం, అనే వ్యూహం వ్యవస్థకు ఉండివుంటే ఈ పరిస్థితి ఉత్పన్నం అయ్యేది కాదు. ఆ వ్యూహమూ లేదు, దానికి కావలసిన నిర్మాణమూ లేదు.

కె. బాలగోపాల్.